# ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



రొద్దం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ , చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్



లేపాక్షి: వృద్ధులకు కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

- ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్

రొద్దం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దగువ్వలపల్లిలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష ' వైద్యశిబిరాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల ఉన్నతికి కృషి చేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీలో కూడా గతంలో కంటే ఎక్కువ వ్యాధులకు చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. వైద్య నిపుణులను గ్రామాలకే రప్పించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. శిబిరంలో చికిత్స చేయించుకున్న వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

**రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ**

హిందూపురం - రొద్దం ప్రధాన రహదారి నుంచి చిన్నగువ్వలపల్లి గ్రామానికి రూ 48 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. గ్రామాని ఏళ్లగా రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు నిర్మాణం చేపట్టడంతో సమస్య పరిష్కామైందని గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ రూప, వైస్ ఎంపీపీ హరితాలక్ష్మి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిపి శ్రీనివాసులు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజారెడ్డి, జిల్లా సేవాదళ్ రాజ్‌గోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**పరిగిలోనూ..**

పరిగి: మండలంలోని శాసనకోటలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకరనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్ని ఓపీలు ఇచ్చారు? ఎంత మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్న విషయాలపై వైద్యులతో ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యారోగ్య అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, సర్పంచ్ దేశాయి మాలతి, ఎంపీటీసీలు జ్యోతి, మారుతీరెడ్డి, చిక్కన్న, నరసింహారెడ్డి, మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**పల్లె ముంగిటకే వైద్యం**

హిందూపురం అర్బన్: జగనన్న సురక్షతో పల్లె ముంగటికే వైద్యం అందుబాటులోకి వచ్చిందని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. మండలంలోని ఎం.బీరేపల్లిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. వలంటీర్లు ముందుగానే గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నటరాజ్, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ సర్పంచ్ సరోజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, రమేష్, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షిలో...**

లేపాక్షి: మండలంలోని మానేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్.దీపికా హాజరయ్యారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద అర్హులైన వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. తర్వాత గ్రామ సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాల్లో పాల్గొని గర్భిణులకు పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, చీరలు అందించారు. కురుబ సేవా సంఘం ఆధ్వర్యంలో కల్లు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గంగమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్, ఈఓఆర్డీ శివన్న, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆలదపల్లిలో స్టాల్‌ను పరిశీలిస్తున్న కుంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని



మడకశిర మండలం గౌడనహళ్లిలో రక్త పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ సరోజమ్మ



సోమందేపల్లి మండలం కేతగాని చెరువు గ్రామంలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం



పెనుకొండ మండలం గోనిపేటలో సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

## క్లుప్తంగా

### బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

హిందూపురం టౌన్: ఎల్‌ఆర్‌జీ కళాశాలలో వాసవ్య మహిళా మండలి కుశల్ హెల్త్ కేర్ క్లినిక్ విప్రో కేర్ సహకారంతో పింక్ నెలను పురస్కరించుకుని సోమవారం బ్రెస్ట్ క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్రెస్ట్ క్యాన్సర్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కుశల్ ఆరోగ్య కేంద్రం ద్వారా ఉచితంగా ఓపీడీ సేవలను అందిస్తున్నామని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వార్షికోత్సవ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

రొళ్ల: మండల కేంద్రం భూతప్ప ఆలయం ఆవరణలో సోమవారం సాయంత్రం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదిగల కురుక్షేత్ర మహా సంగ్రామం పోస్టర్లను విడుదల చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 18న కర్నూల్ పట్టణంలోని దేవిశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పదో వార్షికోత్సవ మహాసభ నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు, దండోర నాయకులు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు



కానిస్టేబుల్ బైక్‌ను ట్రాక్టర్‌తో ఢీకొట్టిన దృశ్యం

హిందూపురం అర్బన్: ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక రవాణాను అడ్డుకోవడంతో ఏకంగా పోలీసు వాహనాన్నే ట్రాక్టర్‌తో ఢీ కొట్టారు. ఎస్‌ఐ ఆజాద్ వివరాల మేరకు.. మండల పరిధిలోని బేవనహళ్లి సమీపంలో పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం రాత్రి అక్కడి వెళ్లారు. ఆ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ పోలీసులపైనే ట్రాక్టరుతో ఢీ కొట్టి తప్పించుకున్నారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ హనుమంతప్ప బైక్ దెబ్బతినడంతో పాటు ఆయనకూ స్వల్పగాయాలయ్యాయి. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### చేనేత పరిశ్రమ పురోగతికి కృషి



కార్మికులతో మాట్లాడుతున్న హర్ ప్రీత్ సింగ్

సోమందేపల్లి: చేనేత పరిశ్రమ పురోగతికి అన్ని విధాలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు ఇన్వెస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధి హర్ ప్రీత్ సింగ్ తెలిపారు. సోమందేపల్లిలోని స్థానిక వెలుగు కార్యాలయంలో 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో ఆయన మాట్లాడారు. స్థానికంగా చేతి మగ్గాల పనితీరుతో పాటు పెట్టుబడి, పట్టుచీరల ఉత్పత్తి, ముడిసరుకుల దిగుబడి లాభాల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఏడీ రమేష్, డీఓ రమణారెడ్డి, స్థానిక చేనేత కార్మిక సంఘం నాయకులు మంచాల అశ్వర్థ, శీలా నారాయణ స్వామి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 14, 17 రైఫిల్ షూటింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పీఈటీ రాజేష్ తెలిపారు. బాబు, ఆసిన్, కావ్య, మౌనిక, అనిత, శిరీష, తేజస్వినితో పాటు మొత్తం 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 28న రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మంజులకు ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి క్లాస్టర్‌లో (సీఆర్‌ఎంటీ) క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్‌గా పని చేస్తున్న రంగనపల్లికి చెందిన శివన్న (40) ఈ నెల 11న అనారోగ్యంతో చనిపోయారు. సోమవారం ఎంఈఓ-2 శ్రీధర్, వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది కలిసి నగదును సేకరించి బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. శివన్న భార్య మంజులకు ఆ మొత్తాన్ని అందజేశారు.

## అర్హులందరికీ ఇంటి స్థలాలు

చిలమత్తూరు: అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ ఇంటి స్థలం మంజూరు చేస్తామని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తహసీల్దార్ నాగరాజుతో కలిసి కోడూరు సమీపంలోని 353 -2ఎ, 2బీ, 353- 2ఎ, 2ఎ సర్వే నంబరులో సుమారు ఐదెకరాల స్థలాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి లేఔట్ మ్యాప్ తయారు చేయాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తహసీల్దార్, సర్వేయర్లకు సూచించారు.



కోడూరు వద్ద గుర్తించిన స్థలంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

## గోళ్లాపురంలో నాగుల ప్రతిష్ట



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని గోళ్లాపురం గ్రామంలోని శివాలయంలో సోమవారం నాగుల ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దేవరాజు, వైస్ ఎంపీపీ రామాంజినప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, సర్పంచులు ఆనంద్, రాము పాల్గొన్నారు.



లక్ష్మీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

## ఘనంగా విగ్రహ ప్రతిష్ట

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో అగ్రిగోల్డ్ లేఅవుట్ కాలనీలో నూతనంగా నిర్మించిన లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

అమరాపురం: సోషల్ మీడియా వేదికగా మడకశిర నియోజకవర్గంలో టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి నాయకులు టీడీపీలోకి చేరినట్లు ఫొటోలను పెడుతున్నారన్నారు. అయితే తమ పార్టీ నుంచి ఎవరూ ఇతర పార్టీలకు వెళ్లలేదని ఆయన స్పష్టం చేశారు. మడకశిర నియోజకవర్గంలో టీడీపీ రెండుగా చీలి ఇరు వర్గాల మధ్య వర్గ పోరు నడుస్తోందన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

## అనారోగ్యంతో సైనికుడి మృతి



సురేశ్ (ఫైల్)

పావగడ: తాలూకాలోని నాగలమడక హోబళి శ్రీరంగపురం గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ ఎస్‌జీ సురేశ్ కుమార్ (36) అనారోగ్యంతో మృతి చెందారు. అయితే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సురేశ్ పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్ పీజీఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పఠాన్ కోట్‌లో ఆయన విధులు నిర్వహించేవారన్నారు. సురేశ్ మరణ వార్త విని తల్లితండ్రులు జయరామరెడ్డి, సునందమ్మ , భార్య వెన్నెల కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి ఇద్దరు కుమారులు. కాగా రెండో కుమారుడు నెలరోజుల క్రితమే జన్మించాడు.

## వాహనదారులపై కేసులు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాలపై ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ చేసిన ఆరుగురిపై సోమవారం కేసులు నమోదు చేసినట్లు సీఐ వి శ్రీనివాసులు తెలిపారు. ఆ వాహనాలను సీజ్ చేశామన్నారు. రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా, చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చినా ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## కేబుల్ చోరీ

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట కాలనీలో నివాసం ఉన్న రైతులు శ్రీరంగప్ప, దేవరాజుతో పాటు రామప్పకు చెందిన మొత్తం 68 మీటర్ల వ్యవసాయ బోరుబావికి అమర్చిన కేబుల్ ఆదివారం రాత్రి అపహరణకు గురైంది. దీంతో మొత్తం రూ.11 వేలు నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

## చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: చిన్నారుల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ నారాయణ, కౌన్సిలర్లు సుదేశ్‌బాబు, పీహెచ్ రాజేశ్, టెంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నవరాత్రులు

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరుగుతున్నాయి. రెండోరోజైన సోమవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి రాత్రి దాకా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రొళ్ల: గాయత్రీదేవిగా కొల్హాపురి మహాలక్ష్మి



పరిగి: తమలపాకు అలంకరణలో కాళికామాత



లేపాక్షి: గాయత్రిదేవి అలంకరణలో దుర్గాదేవి



పెనుకొండ: గాయత్రిదేవి అలంకరణలో మహేశ్వరీదేవి



పావగడ: నాగరూప అలంకారంలో కాళికాదేవి



గుడిబండ: అలంకరణలో తుమ్మల మారెమ్మ



రొద్దం: గాయత్రిదేవి అలంకరణలో రేణుకా యల్లమ్మ



హిందూపురం: గాయత్రిదేవిగా రేణుకా యల్లమ్మ



హిందూపురం: దీబీకాలనీలో గాయత్రీదేవి



హిందూపురం: ఆగ్నేశ్వరీదేవిగా వాసవీమాత



అమరాపురం: ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి



చిలమత్తూరు: కన్యకా పరమేశ్వరీగా చౌడేశ్వరి



సోమందేపల్లి: నరసింహస్వామి అలంకరణలో వాసవీమాత



మడకశిర: పత్తి వత్తులతో కన్యకాపరమేశ్వరి

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

అమరాపురం: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం తిప్పన్న తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏ, మహిళా సంఘం లీడర్లకు స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం తిప్పన్న మాట్లాడుతూ ఆడబిడ్డకు 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా చాలా అనర్థాలు జరుగుతాయన్నారు. అనంతరం అమరాపురంలోని పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి-1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ రెడ్డిరమణమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలు, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటామనే విషయాలను వివరించారు. రక్తహీనత వలన కలిగే అనర్థాలపై తల్లులకు, యుక్తవయస్సు బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, జయమ్మ, ఎంఎస్‌కేలు గాయత్రి, ఉష, నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అగళి: మహిళా చట్టాలు, బాల్యవివాహాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ రవిప్రసాద్, తహసీల్దార్ జమానులాఖాన్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మహిళా చట్టాలు, బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళాల చట్టాలు, బాల్యవివాహాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, ఈఓఆర్డీ పద్మ, సూపర్‌వైజర్ లీలావతి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.